క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన బాలాజి

పుంగనూరు: మండలంలోని నల్లగుట్లపల్లె వద్ద ఆదివారం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం కొళత్తూరుకు చెందిన బాలాజి(30) ద్విచక్ర వాహనంలో పుంగనూరు వస్తున్నాడు. నల్లగుట్లపల్లె వద్ద వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలాజీని స్థానికులు 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదం జరిగితేకానీ స్పందించరా..!


మరుగుదొడ్లు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ ఆర్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాడు–నేడు ద్వారా చేపట్టిన పనులు పూర్తి కాలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం తీసిన గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో స్థానికులు అందులో పడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న వెంకటరెడ్డి

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట గ్రామంలో ఆదివారం విశ్రాంత అధ్యాపకుడు వెంకటరెడ్డి తన తల్లి నాగమ్మ వర్ధంతి సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తన తల్లి పేరున ప్రతి ఏటా పేదలకు దుస్తులు పంపిణీ చేయడంతోపాటు గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జయరామిరెడ్డి, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, జి.శంకర్‌రెడ్డి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ రెడ్డెప్ప, భాస్కర్‌రెడ్డి, పద్మ, సుభాష్ పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి విశిష్టమైంది


నర్సింగ్ పట్టా పొందిన విద్యార్థులతో బీసీఎన్ విద్యా సంస్థల యాజమాన్యం

కుప్పం రూరల్: నర్సింగ్ వృత్తి విశిష్టమైందని, అలాంటి వృత్తికి సేవాభావంతో ప్రతిష్ట తేవాలని బీసీఎన్ కళాశాలల చైర్ పర్సన్ శాంతానాగరాజు తెలిపారు. బీసీఎన్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పట్టాల ప్రదానం చేశారు. చైర్మన్ బీసీ నాగరాజు, చైర్‌పర్సన్ శాంతానాగరాజు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పరమార్థం సేవ మాత్రమేనని, కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు రోగులతో సేవా గుణంతో నడుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఫొటో సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సెక్రటరీ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ వసంత తదితరులు పాల్గొన్నారు.

కోలాహలం.. గణేష్ నిమజ్జనం

వినాయక చవితి సందర్భంగా పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో కొలువుదీరిన వినాయకుడి విగ్రహాలను ఆదివారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తదుపరి వినాయక విగ్రహాలను వాహనాలపై కొలువుదీర్చి మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగింపుగా సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. యువకులు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. పలు గ్రామాల్లో మండపాల వద్ద అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

–పెద్దపంజాణి/ రొంపిచెర్ల/ బైరెడ్డిపల్లె / పుంగనూరు/ గుడుపల్లె / పులిచెర్ల(కల్లూరు)


గుడుపల్లె: నిమజ్జనానికి తరలివెళుతున్న గణపతి



పుంగనూరు హైస్కూల్‌లో వీధిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు, బైరెడ్డిపల్లె: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న ఎస్సీ కాలనీ యువకులు




పులిచెర్లలో వినాయకుని ఊరేగింపు, పెద్దపంజాణి: రాయలపేటలో వినాయకుడి ఊరేగింపులో యువకుల సందడి, పుంగనూరు: రంగులు చల్లుకుంటున్న గుజరాతి మహిళలు



రొంపిచెర్లలో ఊరేగుతున్న వినాయకుడి విగ్రహాలు


బైరెడ్డిపల్లె: గంగినాయనపల్లెలో ఉట్లుమాను ఎక్కుతున్న యువకులు

నేత్రదానంతో మరొకరికి చూపు


పుంగనూరులో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాలు విడుదల చేస్తున్న రహమత్ అలీఖాన్

పుంగనూరు: నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి చూపును ప్రసాదించవచ్చని ప్రభుత్వ ఆప్తమాలజిస్ట్ రహమత్ అలీఖాన్ తెలిపారు. ఆయన ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో జాతీయ నేత్రదాన శిబిరం నిర్వహించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కరపత్రాలు విడుదల చేశారు. రహమత్ అలీఖాన్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. నేత్రదానం చేయడానికి వయస్సుతో నిమిత్తం లేదన్నారు. రెండు కళ్ల దానం చేయడం ద్వారా ఇద్దరికి కంటి చూపును ప్రసాదించిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, కార్యదర్శి అమరావతి సురేష్ పాల్గొన్నారు.

బంతిపూలతోటలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి


బంతిపూల తోటలను పరిశీలిస్తున్న అధికారులు

వి.కోట: బంతి పూల తోటల్లో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారావు తెలిపారు. ఆయన ఆదివారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మండలంలోని కొంగాటం పంచాయతీలో సాగైన బంతి పూల తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బంతి పూలను ఎక్కువగా రసం పీల్చే పురుగులు ఆశిస్తాయని తెలిపారు. వాటి నివారణకు పసుపు, నీలిరంగు జిగురు అట్టలు ఎకరాకు 25 చొప్పున ఏర్పాటుచేయాలన్నారు. కాండం, కాయ తొలిచే పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎకరాకు 10 చొప్పున పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఏవో అప్పోజి, వీఏఏ సుధాకర్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో న్యాయమూర్తి


జడ్జి జయలక్ష్మి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈవో ఏకాంబరం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను ఆదివారం మదనపల్లె సీనియర్ సెషన్స్ కోర్టు జడ్జి జయలక్ష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు ఈవో ఏకాంబరం స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రం కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

పలమనేరు: నియోజకవర్గంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండలాల కన్వీనర్లు బాలాజీనాయుడు, హేమంత్‌కుమార్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, యువరాజ్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు పలమనేరు మున్సిపాలిటీలోని 26 వార్డు, 7.45కు గంగవరం, 8.30గంటలకు పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి, 9.30 గంటలకు వీకోట మండలంలో గోనుమాకులపల్లిలో జరిగే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు విధిగా పాల్గొనాలని కోరారు. ఈ మేరకు వారు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

పార్కులోకి వెళ్లాలంటే ముక్కులు మూసుకోవాల్సిందే


బోయకొండ గంగాపురంలో గల పార్కు వద్ద కుక్క మృతిచెందిన దృశ్యం

చౌడేపల్లె: బోయకొండ గంగాపురం వద్దనున్న పార్కులోకి వెళ్లాలంటే ముక్కులు మూసుకోవాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. పార్కు ఎదుట వున్న రోడ్డుపై వారం క్రితం కుక్క మృతిచెందింది. ఇప్పటి వరకు దాన్ని తొలగించలేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. పార్కులోకి వెళ్లేందుకు వచ్చిన భక్తులు దుర్వాసనతో అటువైపు వెళ్లకనే వెనుతిరుగుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులకు కోరుతున్నారు.

విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు


చౌడేపల్లెలో పట్టుబడిన గంజాయి(ఫైల్)


రహస్యంగా పెంచుతున్న గంజాయి మొక్క(ఫైల్)

- పొట్లం రూ.50లకే లభ్యం
- యథేచ్ఛగా గుట్కాలు, పాన్‌పరాగ్, హాన్స్, ఖైనీల అమ్మకాలు
- మత్తులో చిత్తవుతున్న యువకులు
- పట్టించుకోని అధికారులు

చౌడేపల్లె: మండలంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కొంతమంది అక్రమార్కులు యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయిని పొట్లాల రూపంలో మూటగట్టి విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్కొక్క పొట్లం ధర రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. పోలీసులకు దొరక్కుండా చౌడేపల్లెతోపాటు బోయకొండ, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి ముఠా సభ్యులకు రాజకీయ అండ దొరికిందని, అందువల్లే వారు రెచ్చిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యువత మత్తులో దౌర్జన్యాలకు పాల్పడడం, ఘర్షణలకు ప్రేరేపించడం వంటి ఘటనలు జరుగుతున్నా పోలీసులు మిన్నకుండిపోతున్నారు. కొందరు యువకులు మత్తులో గమ్మత్తుగా చిందులేస్తున్నారు. పట్టపగలే గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ నిషేధిత గుట్కాలు, పాన్‌పరాగ్‌లు, హాన్స్, ఖైనీ, బాద్‌షాలను దర్జాగా దుకాణాల్లో అమ్ముతున్నా పట్టించుకునే నాథుడు లేడు. నిర్ణయించిన ధరకంటే అధికంగా రహస్యంగా తమకు నమ్మకమైన వారికి విక్రయిస్తున్నారని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. వాటిని ఎవరికీ అనుమానం రాకుండా గోదాములు, ఇళ్లలో ఉంచుకుని విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం. తనిఖీ చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో పడి వారి వ్యాపారాలకు రాచమార్గాలు ఏర్పాటుచేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. యువతతో పాటు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు సైతం గంజాయి, గుట్కాలు, పాన్ పరాగ్‌లు, ఖైనీలకు అలవాటుపడ్డారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పుంగనూరులో ఫ్రీజర్ బాక్సులను అందిస్తున్న దాతలు కమలమ్మ, రఘునాథరెడ్డి

సేవా గుణం కలిగి ఉండాలి

పుంగనూరు: ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి వుండి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మానవత సంస్థ చైర్మన్ డాక్టర్ నందీశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక విశ్రాంత ఉపాధ్యాయురాలు కమలమ్మ తన భర్త గోపాలశెట్టి జ్ఞాపకార్థం, అలాగే స్థానిక చెంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రఘునాథ రెడ్డి కలిసి ఆదివారం రూ.1.50 లక్షల విలువైన రెండు ఫ్రీజర్ బాక్సులను సంస్థకు విరాళంగా ఇచ్చారు. వారిని చైర్మన్ అభినందించారు. ప్రస్తుతం సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేసుకునేవారికి 7 ఫ్రీజర్ బాక్సులు, వైకుంఠ రథాన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రజలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వనిత, గంగులమ్మ, శారదమ్మ, నానబాల గణేష్, నారాయణరెడ్డి, పూలత్యాగరాజు, హరినాథ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, భరత్‌భూషణ్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత పనులకు మెరుగులు

కూలీలకు స్థానికంగా పనులు కల్పించి వలసలను నివారించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఉపాధి హామీ పథకం పచ్చ నేతలకు ఆదాయ వనరుగా మారింది. జేసీబీలతో గుంతలు తవ్వి పైపైన నగిషీలు చెక్కుతున్నారు. అంతేగాక గతంలో చేసిన పనులకు పైపై మెరుగులు దిద్దుతున్నారు. వాటిని ఉపాధి కూలీలే చేసినట్టు రికార్డులు తయారుచేస్తున్నారు. ఈ అక్రమాల్లో ఉపాధి సిబ్బంది నుంచి అధికారులు వరకు భాగస్వాములు కావడం గమనార్హం.

- కూలీలతో పనులు చేసినట్టు ఫేసియల్, ఫొటోలు
- అక్రమార్కులతో జత కట్టిన ఉపాధి సిబ్బంది, అధికారులు
- ప్రజా ధనాన్ని స్వాహా చేస్తున్న పచ్చనేతలు

బైరెడ్డిపల్లి మండలం రామన్నపల్లి గంటల చెరువులో జేసీబీలతో చేసిన పనులు


పలమనేరు: పలమనేరు క్లస్టర్‌లో బంగారుపాళెం, చౌడేపల్లి, గంగవరం, పలమనేరు, పెద్దపంజాణి, పుంగనూరు, కుప్పం క్లస్టర్‌లో బైరెడ్డిపల్లి, వి.కోట, రామకుప్పం, గుడిపల్లి, కుప్పం మండలాలున్నాయి. వీటిలో 90 వేలకు పైగా జాబ్ కార్డులు వుండగా 15 వేలకు పైగా యాక్టివ్ జాబ్ కార్డులు వున్నాయి. ప్రస్తుతం 3,200 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఫారంపాండ్స్, చెరువుల్లో పూడికతీత పనులు, పొలాలకు బంకమట్టి తోలకం, క్యాటిల్ షెడ్లు, హార్టికల్చర్ కింద మొక్కల పెంపకం పనులు చేస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు

ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అవసరమైన ఉపాధి పనులను గుర్తించాలి. ఈ తీర్మానాన్ని సంబంధిత పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు ఆమోదించాలి. తర్వాత జాబ్ కార్డులున్న కూలీలకు పనులు కల్పించాలి. ఆపై ఉపాధి హామీ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టి వాటిని మస్టర్‌లో నమోదు చేయాలి. జీపీఎస్ ఆధారంగా రోజూ పనులు చేస్తున్న కూలీల ఫొటోలను తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. తర్వాత బిల్లులు పెట్టాలి. కూటమి నేతలు ఉపాధి అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో 80 శాతం వరకు పాత పనులకు నగిషీలు చెక్కి నిధులను బొక్కేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం సప్లయి చానళ్లు, ఫారంపాండ్స్ తదితరాలను గతంలో చేసిన పాత గుంతలకే మళ్లీ జేసీబీలతో నగిషీలు చెక్కి వాటిని కూలీలు చేసినట్టు తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారు. యంత్రాలతో చేసిన పనులకు నగిషీలు చెక్కేందుకు ప్రత్యేక కూలీలు, బిల్లుల కోసం జాబ్‌కార్డున్న వారు ఫొటోలకు వస్తే క్వార్టర్ మద్యం, భోజనం పెడుతున్నట్టు సమాచారం. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లిలోని పెద్ద చెరువు, రామనపల్లి వద్ద గంటల చెరువులో జేసీబీలతోనే పనులు చేస్తున్నారు. అక్కడికి కూలీలను రప్పించి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

రూ.5 కోట్ల వరకు అక్రమాలు

నియోజకవర్గంలో ఉపాధి హామీ కింద ఇప్పటి వరకు రూ.5 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు సమాచారం. ఇక్కడ జరిగిన పనులను జిల్లా అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూస్తాయని స్థానికులు బహిరంగంగా చెబుతున్నారు. ఈ విషయమై బైరెడ్డిపల్లి ఉపాధి ఏపీవో హరినాథ్‌ను వివరణ కోరగా తాము ఎవరికీ వర్క్ ఆర్డర్లు ఇవ్వలేదని తెలిపారు. ఎవరైనా యంత్రాలతో పనులు చేసినా బిల్లులు పెట్టబోమని తెలిపారు. పనులపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామన్నారు.


బైరెడ్డిపల్లెలో జేసీబీతో చేసిన పనులు


చెరువులో పనులు చేస్తున్న జేసీబీ

నేడు ఫ్యామిలీ డాక్టర్ సేవలు

బైరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు అందిస్తామన్నారు.